నేటి మ్యాచ్: ముంబై X బెంగళూరు | ముంబై : రా. 7.30



# సైబరాబాద్‌లో జోరుగా క్రికెట్ బెట్టింగ్

**రూ.43.57 లక్షలు స్వాధీనం**



సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. ఈనెల 8న కమిషనరేట్ పరిధిలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఆన్‌లైన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న మరో ముఠాకు చెందిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరు జిల్లాకు చెందిన వెంకటేశ్వర్‌రావు అలియాస్ చిన్ను లండన్‌లో స్థిరపడ్డాడు. అక్కడి నుంచి ఆన్‌లైన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. ఇతడికి అదే జిల్లా వాసి అలూరు త్రినాథ్(34), మనం రాజేష్, బొల్లె స్వామి(30), మర్పెన్న గణపతిరావు(57)లు బుకీలుగా వ్యవహరిస్తూ సహకరిస్తున్నారు. ఐపీఎల్-2024 క్రికెట్ మ్యాచ్‌లపై 'క్రికెట్ లైవ్ గురు', 'లక్కీ ఆన్‌లైన్' యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో త్రినాథ్‌తో పాటు రాజేష్, స్వామి, గణపతిరావును అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.43.57లక్షల నగదుతో పాటు 8 ఖరీదైన స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్, ట్యాబ్ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

# జాతీయ క్యారమ్స్ చాంప్ శ్రీనివాస్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: గ్వాలియర్ వేదికగా జరిగిన 51వ జాతీయ సీనియర్ క్యారమ్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన శ్రీనివాస్ టైటిల్ విజేతగా నిలిచాడు. బుధవారం జరిగిన పురుషుల ఫైనల్లో శ్రీనివాస్(పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు) 25-0, 25-9తో ఆదిత్య(తెలంగాణ)పై అద్భుత విజయం సాధించాడు. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పోరులో శ్రీనివాస్ తనదైన రీతిలో సత్తాచాటాడు. మరోవైపు మహిళల టీమ్ చాంపియన్‌షిప్ తుది పోరులో తెలంగాణ 0-3 తేడాతో ఉత్తరప్రదేశ్ చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. విజేతలను రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ ప్రత్యేకంగా అభినందించింది.

# ప్రిక్వార్టర్స్‌లో సింధు

**బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్**

నింగ్‌బో: ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్ తప్ప మిగిలిన భారత అగ్రశ్రేణి షట్లర్లు తొలిరౌండ్‌లోనే చేతులెత్తేశారు. మహిళల సింగిల్స్‌లో సింధు 18-21, 21-14, 21-19 తేడాతో మలేషియాకు చెందిన గోజిన్ వెయిని చిత్తుచేసి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించింది. తొలి గేమ్ కోల్పోయినా తర్వాత పుంజుకున్న సింధు వరుస గేమ్స్‌లో ప్రత్యర్థిని మట్టికరిపించింది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్..17-21, 23-21, 23-21 తేడాతో ప్రపంచ 33వ ర్యాంకర్ లు గువాంగ్ జు (చైనా)తో పోరాడి గెలిచాడు. మిగతా మ్యాచ్‌ల్లో శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్, లక్ష్యసేన్, త్రిసాజాలీ-గాయత్రి గోపీచంద్ ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు.

# నితీశ్ ఖాతాలో అరుదైన రికార్డు

ముల్లాన్‌పూర్: పంజాబ్ కింగ్స్‌తో మంగళవారం ముగిసిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షో తో అదరగొట్టిన తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి ఐపీఎల్‌లో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఒక మ్యాచ్‌లో అర్ధ సెంచరీ చేయడమే గాక బౌలింగ్‌లో ఒక వికెట్ తీసి ఫీల్డింగ్‌లో క్యాచ్ పట్టిన తొలి అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా రికార్డులకెక్కాడు. పంజాబ్‌తో మ్యాచ్‌లో 37 బంతుల్లోనే 64 పరుగులు చేసిన నితీశ్.. బౌలింగ్‌లో జితేశ్ శర్మ వికెట్ తీశాడు. ఫీల్డింగ్ చేస్తూ ప్రభ్‌సిమ్రన్ క్యాచ్‌ను అందుకున్నాడు.



# తెలంగాణకు 9 పతకాలు

- **జాతీయ సెయిలింగ్ టోర్నీ**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: షిల్లాంగ్ (మేఘాలయ) వేదికగా జరిగిన జాతీయ ర్యాంకింగ్ సెయిలింగ్ టోర్నీలో తెలంగాణ సెయిలర్లు పతక జోరు కనబరిచారు. ఉమియం సరస్సులో జరిగిన టోర్నీలో మన సెయిలర్లు తొమ్మిది పతకాలు కైవసం చేసుకున్నారు. దీనికి తోడు ఉత్తమ సెయిలింగ్ జట్టు అవార్డును దక్కించుకుంది. బాలుర అండర్-15 విభాగంలో గోవర్ధన్ తొలిసారి జాతీయ టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. హైదరాబాద్‌కే చెందిన దీక్షితను ఓడిస్తూ స్వర్ణ పతకం కూడా గెలుచుకున్నాడు. సిస్టర్స్ ద్వయం కొమురవెల్లి దీక్షిత, లహరి స్వర్ణం, రజతాలు కైవసం చేసుకున్నారు. ఒక జాతీయ టోర్నీలో తెలంగాణకు మూడు పతకాలు రావడం ఇదే తొలిసారి. భారత రెండో ర్యాంకర్ బన్నీ..రిజ్వాన్‌ను ఓడించి కాంస్యం కైవసం చేసుకున్నాడు. అండర్-18లో డబుల్ హ్యాండర్‌లో తనుజా కామేశ్వర్-గణేశ్ రజతం దక్కించుకోగా, ధరణి, మల్లేశ్ వెండి ఖాతాలో వేసుకున్నారు. మొత్తంగా జాతీయ సెయిలింగ్‌లో తెలంగాణ అత్యుత్తమ ప్రదర్శనగా ఇది నిలిచింది.

# ఆఖరి బంతికి గుజరాత్ గెలుపు

**ఉత్కంఠ పోరులో టైటాన్స్ పైచేయి.. రాజస్థాన్ రాయల్స్‌కు తొలి ఓటమి.. శాంసన్, పరాగ్ ఇన్నింగ్స్ వృథా**



గిల్ (72)

**ఐపీఎల్-17లో పంజాబ్- హైదరాబాద్ మధ్య ముగిసిన ఉత్కంఠ మ్యాచ్‌ను మరిచిపోకముందే మరో ఆసక్తికర పోరు అభిమానులను అలరించింది. వరుస విజయాలతో దూసుకుపోతున్న రాజస్తాన్ రాయల్స్ జోరుకు గుజరాత్ టైటాన్స్ కళ్లెం వేసింది. ఆఖరి బంతికి ఫలితం తేలిన ఈ మ్యాచ్‌లో రాయల్స్‌కు ఓటమి రుచి చూపించింది. బౌలింగ్‌లో విఫలమైనా బ్యాటింగ్‌లో గుజరాత్ సమిష్టిగా ఆడి విక్టరీ కొట్టింది. ఛేదనలో గుజరాత్‌కు గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా ఆఖర్లో రాహుల్ తెవాటియా, రషీద్‌ఖాన్ మెరుపులతో రాజస్తాన్‌కు ఓటమి తప్పలేదు.**

జైపూర్: ఐపీఎల్-17లో వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచిన రాజస్తాన్ రాయల్స్‌కు గుజరాత్ తొలి షాక్ ఇచ్చింది. జైపూర్‌లోని సవాయ్‌మాన్ సింగ్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో రాయల్స్‌ను ఓడించింది. పలు మార్లు వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందు బ్యాటింగ్ చేసిన రాజస్తాన్.. రియాన్ పరాగ్ (48 బంతుల్లో 76, 3 ఫోర్లు, 5 సిక్సర్లు), కెప్టెన్ సంజూ శాంసన్ (38 బంతుల్లో 68 నాటౌట్, 7 ఫోర్లు, 2 సిక్సర్లు) సమయోచిత ఇన్నింగ్స్‌లతో రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో గుజరాత్.. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఆ జట్టు సారథి శుభ్‌మన్ గిల్ (44 బంతుల్లో 72, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ సెంచరీతో పోరాడగా సాయి సుదర్శన్ (29 బంతుల్లో 35, 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. ఆఖర్లో రాహుల్ తెవాటియా (11 బంతుల్లో 22, 3 ఫోర్లు), రషీద్ ఖాన్ (11 బంతుల్లో 24 నాటౌట్, 4 ఫోర్లు) లు అద్వితీయ పోరాడటంతో గుజరాత్ గెలుపుబాట పట్టింది. రషీద్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

## శాంసన్-పరాగ్ షో..

రాజస్తాన్ ఇన్నింగ్స్ నెమ్మదిగానే మొదలైంది. ఈ సీజన్‌లో వరుసగా విఫలమవుతున్న యశస్వీ జైస్వాల్ (19 బంతుల్లో 24, 5 ఫోర్లు) టచ్‌లోకి వచ్చినట్టే కనిపించినా ఉమేశ్ యాదవ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ మాథ్యూ వేడ్ సూపర్ క్యాచ్ పట్టడంతో వెనుదిరిగాడు. ఆర్సీబీతో గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన బట్లర్ (8) మరోసారి రషీద్ స్పిన్ మాయాజాలానికి తలవంచక తప్పలేదు. ఓపెనర్లు నిష్క్రమించాక వచ్చిన శాంసన్, రియాన్ పరాగ్.. క్రీజులో కుదురుకునేదాకా బంతికోపరుగు అన్నట్టుగానే ఆడారు. కానీ 12వ ఓవర్ నుంచి ఇద్దరూ గేర్ మార్చారు. నూర్ అహ్మద్ వేసిన ఆ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన పరాగ్.. మోహిత్ శర్మ వేసిన తర్వాతి ఓవర్లో మరో సిక్సర్ కొట్టి 34 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. 15వ ఓవర్లో శాంసన్.. స్పెన్సర్ జాన్సన్‌ను లక్ష్యంగా చేసుకుని రెండు ఫోర్లు, సిక్సర్‌తో స్కోరుబోర్డు వేగాన్ని పెంచాడు. మోహిత్ వేసిన 17వ ఓవర్లో ఆఖరి బంతికి లాంగాన్ దిశగా బౌండరీతో అతడూ ఈ సీజన్‌లో మూడో అర్ధ శతకం పూర్తిచేసుకున్నాడు. 78 బంతుల్లో 130 పరుగులు జోడించిన ఈ జోడీని మోహిత్ శర్మ విడదీశాడు. 8 ఓవర్లకు 52/2గా ఉన్న రాజస్తాన్ స్కోరు 20 ఓవర్లకు 196/3గా ముగిసిందంటే అది ఈ ఇద్దరి చలవే.

## కూల్చిన కుల్‌దీప్..

భారీ ఛేదనలో గుజరాత్‌కు శుభారంభమే దక్కినా ఓపెనర్లు ధాటిగా ఆడలేకపోయారు. రాజస్తాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో గుజరాత్ స్కోరు వేగం పుంజుకోలేదు. 8.2 ఓవర్లలో 64 పరుగులు జోడించిన ఈ జోడీని కుల్‌దీప్ సేన్ విడదీశాడు. 2 ఓవర్ల వ్యవధిలో అతడు మూడు కీలక వికెట్లు పడగొట్టి గుజరాత్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. సాయి సుదర్శన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న కుల్‌దీప్.. వేడ్, అభినవ్‌ను ఒకే ఓవర్లో క్లీన్‌బౌల్డ్ చేశాడు. విజయ్ శంకర్ (16)ను చాహల్ బలిగొన్నాడు. క్రీజులోకి వచ్చినోళ్లు వచ్చినట్టే సహచర ఆటగాళ్లు వెనుదిరుగుతున్నా పట్టుదలతో ఆడిన గిల్ 35 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేశాడు. ఆఖరి 5 ఓవర్లలో ఆ జట్టు విజయానికి 73 పరుగులు అవసరం కాగా.. చాహల్.. గిల్‌ను బోల్తా కొట్టించాడు. షారుక్ ఖాన్ (14)ను అవేశ్ ఖాన్ ఎల్బీగా వెనక్కిపంపాడు. కానీ తెవాటియా, రషీద్ ఆఖర్లో అద్భుతంగా పోరాడారు. కుల్‌దీప్ 19వ ఓవర్లో ఈ ఇద్దరూ 20 పరుగులు రాబట్టారు. చివరి ఆరు బంతుల్లో గుజరాత్ విజయానికి 15 పరుగులు అవసరం కాగా గత రెండు మ్యాచ్‌లలో రాజస్తాన్‌ను గెలిపించిన అవేశ్ ఖాన్.. ఈసారి విఫలమయ్యాడు. రషీద్ ఖాన్ బౌండరీలతో విరుచుకుపడి రాయల్స్‌కు షాకిచ్చాడు.

### సంక్షిప్త స్కోర్లు

**రాజస్తాన్** : 20 ఓవర్లలో 196/3 (పరాగ్ 76, శాంసన్ 68 నాటౌట్, రషీద్ 1/18, ఉమేశ్ 1/47). **గుజరాత్** : 20 ఓవర్లలో 199/7 (గిల్ 72, సాయి 35, కుల్‌దీప్ 3/41 , చాహల్ 2/43)

# అథ్లెట్లకు భారీ నజరానా

**వరల్డ్ అథ్లెటిక్స్ సంచలన నిర్ణయం • 128 ఏండ్ల ఒలింపిక్స్ చరిత్రలో తొలిసారి**

పారిస్: 128 ఏండ్ల విశ్వక్రీడల చరిత్రలో నూతన అధ్యాయం. ఒలింపిక్స్‌లో పాల్గొనే, పతకాలు గెలిచిన క్రీడాకారులకు పతకాలు తప్ప నగదు బహుమానం అందజేసిన దాఖలాలు ఇప్పటివరకూ లేవు. కానీ త్వరలో పారిస్ వేదికగా జరుగబోయే ఒలింపిక్స్‌లో ఈ సంప్రదాయానికి వరల్డ్ అథ్లెటిక్స్ (డబ్ల్యూఏ) ముగింపు పలికింది. 2024 ఒలింపిక్స్‌లో భాగంగా ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగాల్లో పోటీపడి స్వర్ణ పతకాలు గెలిచే క్రీడాకారులకు నగదు బహుమానం కింద 50 వేల యూఎస్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.41.60 లక్షలు) అందించేందుకు సిద్ధమైంది. ఇలా నగదు బహుమానాన్ని ప్రకటించిన తొలి అంతర్జాతీయ క్రీడా సమాఖ్యగా డబ్ల్యూఏ నిలిచింది. ఈ మేరకు బుధవారం వరల్డ్ అథ్లెటిక్స్ ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించింది. ప్రోత్సాహకాలు అందించేందుకు గాను 2.4 మిలియన్ల యూఎస్ డాలర్లను ఇప్పటికే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) వద్ద డిపాజిట్ చేసినట్టు తెలిపింది. మొత్తం 48 విభాగాల్లో పసిడి పతకాలు గెలిచే వారికి నగదు అందజేయనున్నారు.

# భారత్ హ్యాట్రిక్ ఓటమి

పెర్త్ : ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత హాకీ జట్టుకు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ పరాభవం తప్పలేదు. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా పెర్త్ వేదికగా బుధవారం ముగిసిన మూడో టెస్టులో భారత్.. 1-2 తేడాతో ఆస్ట్రేలియా చేతిలో చిత్తైంది. భారత్ తరఫున 41వ నిమిషంలో జుగ్‌రాజ్ సింగ్ ఏకైక గోల్ కొట్టగా 44, 49వ నిమిషాల్లో ఆస్ట్రేలియా ఆటగాడు జెరెమీ హేవర్డ్ రెండు గోల్స్ కొట్టి భారత్ విజయావకాశాలపై నీళ్లు చల్లాడు. ఆట తొలి అర్ధ భాగంలో భారత్.. ఆస్ట్రేలియాను నిలువరించింది. జుగరాజ్ గోల్‌తో భారత్ ఆధిక్యంలోకి వచ్చినా హేవర్డ్ ఐదు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ కొట్టి కంగారూలను ఆధిక్యంలోకి తెచ్చాడు.

### పాయింట్ల పట్టిక

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 5 | 4 | 1 | 0.87 | 8 |
| కోల్‌కతా | 4 | 3 | 1 | 1.52 | 6 |
| లక్నో | 4 | 3 | 1 | 0.77 | 6 |
| చెన్నై | 5 | 3 | 2 | +0.66 | 6 |
| హైదరాబాద్ | 5 | 3 | 2 | +0.34 | 6 |
| గుజరాత్ | 6 | 3 | 3 | -0.63 | 6 |
| పంజాబ్ | 5 | 2 | 3 | -0.19 | 4 |
| ముంబై | 4 | 1 | 3 | -0.70 | 2 |
| బెంగళూరు | 5 | 1 | 4 | -0.84 | 2 |
| ఢిల్లీ | 5 | 1 | 4 | -1.37 | 2 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు





Honda Exclusive Authorized Dealerships: KARIMNAGAR, KARIMNAGAR INTERCITY BRANCH, VAVILALA RAMREDDY NAGAR, JAGATIAL, KORUTLA, SIRCILLA, VEMULAWADA, METPALLY, JAMMIKUNTA, HUSNABAD, HUZURABAD, RAMAGUNDAM, PEDDAPALLY, SULTANABAD, DHARMARAM, MANCHERIAL, BELLAMPALLY, ASIFABAD, KAGAZNAGAR, ADILABAD, NIRMAL, KHANAPUR, BHAINSA.

For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.